క్లుప్తంగా

కల్యాణ మహోత్సవం

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని పెద్దాపూర్‌లో సోమవారం బీరప్ప కామరాతి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయమే నైవేద్యాలతో స్వామిని దర్శించుకొని బోనాలను సమర్పించారు. బోనాల ఊరేగింపులో డోలు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఆవరణలో పెద్దపట్నం వేసి బీరప్ప కామ రాతి కల్యాణాన్ని జరిపించారు. టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని వారు వేడుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఆశిరెడ్డి, మాణిక్ రెడ్డి, శ్రీనివాస్, చిరు, భిక్షపతి, ప్రకాష్, అరుణ్ గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి



ప్రచారం నిర్వహిస్తున్న మురళీధర్ యాదవ్

హత్నూర(సంగారెడ్డి): బీజేపీ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమని మూడోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కావడం ఖాయమని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్ అన్నారు. సోమవారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హత్నూరలో మెదక్ లోక్‌సభ అభ్యర్థి రఘునందన్‌కు మద్దతుగా గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పదేళ్ల పాలనల్లో దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందిందన్నారు. కాగా మెదక్‌లో రఘునందన్ విజయం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగప్రభు గౌడ్, మండల నాయకులు నీరుడి అశోక్, చంద్ర గౌడ్, పండుగ రాజు, తోట రాజు, రాజు యాదవ్, శ్రీశైలం, శక్తి కేంద్రం ఇన్‌చార్జి గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు, అభిషేకాలు



శివలింగానికి మైనంపల్లితో కలిసి అభిషేకం చేస్తున్న మధు

పటాన్‌చెరు టౌన్: దూలపల్లిలోని సీతారామ చంద్రస్వామి, విశాలాక్షి విశ్వేశ్వర దేవస్థానాన్ని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు ఇద్దరూ కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకుల సమక్షంలో శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చంద్రపాల్, కొంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు, రాజేష్, రుద్రారం మాజీ సర్పంచ్ కుర్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పనులను పూర్తి చేయాలి

కంది(సంగారెడ్డి): అమ్మ ఆదర్శ పాఠశాలకు ఎంపికై న స్కూళ్లలో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు మంజూరైన నిధుల వినియోగంపై గ్రామ సమైక్యాల అధ్యక్షులు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రెండు, మూడు రోజుల్లో అన్ని పాఠశాలల్లో పనులను ప్రారంభించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే లోపు పనులన్నీ పూర్తి అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంఈఓ వెంకట్, ఎంపీఓ మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న రమేశ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేశ్‌కు జాతీయస్థాయి పురస్కారం లభించింది. ఉగాది క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని.. జాతీయ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాయ గానసభ వెంకటదీక్షితులు కళావేదికలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గ్రామ అభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం లాంటి సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ఇచ్చినట్లు రమేశ్ చెప్పారు.

ముస్తాబు

శ్రీరామ నవమి ఉత్సవాలకు రామాలయాలు ముస్తాబయ్యాయి. ఈనెల 17న సీతారాముల కల్యాణోత్సవం, 18న పట్టాభిషేకం ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గాను నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి)లో గల కోదండ రామాలయం, జహీరాబాద్ పట్టణంలోని రామాలయంలో ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. – జహీరాబాద్

ఆలయానికి ప్రత్యేక చరిత్ర

కొత్తూర్(బి)లో గల కోదండ రామాలయానికి ప్రత్యేక చరిత్ర ఉన్నట్లు భక్తులు చెబుతున్నారు.. త్రేతాయుగంలో రావణుడు సీతమ్మను అపహరించుకెళ్లగా.. వెతుక్కుంటూ రామలక్ష్మణులు ఒక రాత్రి ఈ ప్రదేశంలో నిద్రించినట్లు ప్రచారంలో ఉంది. కాగా, ఈ ప్రదేశంలో ఆలయాన్ని నిర్మించి ఏటా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో వెలసిన అశ్వథా వృక్షం ఈ క్షేత్రంలో ఒక ప్రత్యేకతని చెప్పొచ్చు.



కొత్తూర్.. కోదండరామాలయంలో సీతారామలక్ష్మణ స్వామి విగ్రహాలు

మహోత్సవాలు



ప్రతిష్ఠాపనకు తెచ్చిన శివలింగం, నందీశ్వరుడి విగ్రహం



ఆలయ ప్రాంతంలో చేపట్టిన నిర్మాణాలు

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ. మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ ఆలయాన్ని పునరుద్ధరించి పలు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఆవరణలో ధ్వజస్తంభం, నవగ్రహాలు, కాలభైరవ, మంగళగౌరి మాత, హఠకేశ్వర స్వామి, నందీశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. తొలిరోజు గోపూజ, ధ్వజారోహణం, ఆలయ ప్రవేశం, మహాగణపతి పూజ,అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, ప్రతిష్ఠ విగ్రహ మూర్తుల ఊరేగింపు, జలాధివాసం, మహామంగళహారతి తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

- 17న అవాహిత దేవత పూజలు, దేవతల మూల మంత్ర హోమం, ఫలాదివాసం, పుష్పదివాసం, 18న మేలు కొలుపు, యంత్ర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, అలంకరణ, హోమ సమాప్తి, పూర్ణహుతి, మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

లింకు రోడ్లు అధ్వానం

- ఝరాసంగం, బిడెకన్న, చీలపల్లి, కుప్పాగర్ రహదారుల దుస్థితి
- ప్రయాణికులు, వాహనదారులకు తప్పని తిప్పలు



కంకర తేలిన కుప్పానగర్–క్రిష్ణాపూర్ లింకు రోడ్డు

ఝరాసంగం(జహీరాబాద్): లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అధికారులు నిర్లక్ష్యం, నిర్వహణ లోపమే కారణమని తెలుస్తోంది. కాగా వాహనదారులు, ప్రయాణికులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచటం లేదు. మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు బిడెకన్న, చీలపల్లి, కుప్పాగర్, పొట్టిపల్లి, కక్కర్‌వాడ, కొల్లూర్, కంబాలపల్లి, మాచ్నూర్, క్రిష్ణాపూర్‌తో పాటు వివిధ గ్రామాల నుంచి ఇతర పల్లెటూర్లకు వెళ్లేందుకు లింకు రోడ్లున్నాయి. పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. కంకర కుప్పలు, మట్టి దిబ్బలతో దర్శనం ఇస్తున్నాయి. రోడ్లు అస్తవ్యస్తంగా మారి ప్రయాణాలకు ఇబ్బందులుగా మారాయి. వాటికి మరమ్మతులు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆయా గ్రామాల ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు తమ వాహనాలు కూడా పాడైపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే లింకు రోడ్లు అధ్వానంగా మారటంతో చుట్టూ తిరిగి ఇతర గ్రామాల మీదుగా రాకపోకలు సాగించాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. దీంతో దూరాభారంతో పాటు సమయం వృథావుతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని, అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాచ్నూర్–క్రిష్ణాపూర్ లింకు రోడ్డుపై ఏర్పడిన గుంత

మరమ్మతు చేపట్టాలి



పాడైన లింకు రోడ్లకు మరమ్మతు చేపట్టాలి. మాచ్నూర్–క్రిష్ణాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరుపైపులా పూర్తిగా చెట్ల కొమ్మలు దట్టంగా పెరిగిపోయాయి. కాగా కొన్ని చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డు పూర్తిగా పాడైపోయి, వాహనాలు అదుపు తప్పి జారి పడుతున్నాయి.

–పెంటయ్య, క్రిష్ణాపూర్

అతిపెద్ద కుంభకోణం ధరణి

మంత్రి దామోదర రాజనర్సింహ



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రపంచంలో ఎక్కడా లేని అతిపెద్ద కుంభకోణం ఏదైనా ఉందంటే అది ధరణేనని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం రాత్రి పట్టణంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు వేల కోట్లు ఎలా సంపాదించాడని ప్రశ్నించారు. ఆయన గురించి అందరికీ తెలుసునన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు కట్టినప్పుడు కలెక్టర్ ఎవరని, దాని వల్ల ఎంతమంది నిర్వాసితులు భూములను కోల్పోయారన్నారు. రాష్ట్రాన్ని 7 లక్షల కోట్ల అప్పుల పాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. ఫోన్ టాపింగ్‌ల గురించి మాట్లాడాలా? బీఆర్‌ఎస్ నేతలు సంపాదించిన అక్రమ ఆస్తుల గురించి మాట్లాడమంటారా? అని కార్యకర్తలను అడిగారు. పేదలకు 25 లక్షల భూమిని పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. పోచంపాడు ప్రాజెక్టు కట్టింది కాంగ్రెస్సే అన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక వజ్రాయుధం అన్నారు. పార్టీ అభ్యర్థి నీలం మధును గెలిపించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

జహీరాబాద్ టౌన్: నాలాపై అక్రమంగా నిర్మించిన గోడను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఈనెల 13న సాక్షి దినపత్రికలో 'కబ్జా కోరల్లో నాలా స్థలం' అనే కథనాన్ని ప్రచురించగా అధికారులు స్పందించారు. మున్సిపల్ టౌన్ ప్రణాళికా అధికారి నరేష్, ఇరిగేషన్ శాఖ అధికారి జానకిరాం.. కబ్జాకు గురైన నాలాను పరిశీలించి జేసీబీ సహాయంతో నిర్మాణాన్ని పూర్తిగా తొలగించారు. విషయానికొస్తే.. పట్టణంలోని 14వ వార్డు పరిధిలో ఉన్న రాచన్నపేట ప్రాంతంలో 173, 174 సర్వే నంబర్‌లో నాలా ఉంది. కొందరు కబ్జా చేసి అడ్డంగా గోడ నిర్మిస్తున్నారు. మురుగు పారకపోవడంతో కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఎట్టకేలకు నిర్మాణాన్ని అధికారులు కూల్చివేయడంపై మాజీ కౌన్సిలర్ నామరవికిరణ్, కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌లోకి చేరికలు



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, సురేష్ షెట్కార్, రాములు నాయక్

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలో పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్‌లోకి చేరారు. స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్, బీజేపీ, బహుజన ముక్తి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు.. 2 వేల మంది చేరారు. ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి, జహీరాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ సమక్షంలో కార్యక్రమం జరిగింది. చేరిన వారిలో బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాష్ రాథోడ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు గౌస్‌చిష్తీ, పలువురు మైనార్టీ నాయకులు, పెద్దశంకరంపేట, కమలాపూర్, కోలపల్లి, ఎంపీటీసీలు సుభాష్‌గౌడ్, రాజేశ్వర్‌రావు దొర, గణేష్.. మాజీ ఎంపీటీసీలు విక్రమ్ వేణుగోపాల్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు శంకర్రావు, శంకరయ్య, కుంట్ల రాములు, మాణిక్యం తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

వాహనాల తనిఖీలు

జిన్నారం(పటాన్‌చెరు): స్థానిక గిరిజన గురుకుల పాఠశాల సర్కిల్ వద్ద సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీలు చేశారు. ఎస్‌ఐ విజయరావు ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికలు సమీపిస్తుండంతో మరిన్ని తనిఖీలు చేపడుతామని అన్నారు.

ప్రాణప్రతిష్ఠలో పాటిల్



రాసోల్‌లో ప్రాణప్రతిష్ఠలో పాటిల్, బీజేపీ నేతలు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని రాసోల్‌లో నూతనంగా నిర్మించిన సీతారామలక్ష్మణుల విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సోమవారం పాల్గొన్నారు. ప్రాణప్రతిష్ఠ, శిఖర స్థాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల అనంతరం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ స్టిక్కర్లు అంటించి కమలం పువ్వుకు ఓటు వేయాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో సంగప్ప జనవాడె, అరుణ్ శేరికర్, శ్రీనివాస్ మహారాజ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంటకు రక్షణగా.. పాత చీరల కంచె



ఇరిగిపల్లిలో పంట చుట్టూ కంచెగా కట్టిన చీరలు

సంగారెడ్డి టౌన్: పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. సంగారెడ్డి మండలం ఇరికిపల్లిలో ఓ రైతు.. పక్షులు, అడవి పందుల బారి నుంచి రక్షించుకోవడానికి పంట చుట్టూ పాత చీరలను కట్టాడు. పైరును కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. జిల్లాలోని చాలా గ్రామాల్లో ప్రస్తుతం వరి, జొన్న, మరి కొన్ని పంటలు సాగులో ఉన్నాయి.

సంక్షిప్త వార్తలు

◆ పాఠశాలలకు మరమ్మతు చేయాలి

మునిపల్లి(అందోల్): మండలంలోని 42 ఆదర్శ పాఠశాలలో మైనర్ రిపేర్లు చేయాలని ఎంపీడీఓ హరినందన్‌రావు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. సోమవారం ఎంపీపీ సమావేశ మందిరంలో పాఠశాలల మరమ్మతులపై ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఆయా శాఖల అధికారులు, ఎంఈఓ దశరథ్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలో విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, టాయిలెట్లు, తరగతి గదుల మరమ్మతు, మరుగుదొడ్ల వంటి మైనర్ రిపేర్లు చేయాలన్నారు. త్వరిత గతిన పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ బాగయ్య, ఆయా శాఖల అధికారులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పాఠశాలల అభివృద్ధికి చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ రవీందర్‌గౌడ్ తెలిపారు. మండల వ్యాప్తంగా 31 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట ప్రభుత్వం రూ.70 లక్షల నిధులు కేటాయించిందన్నారు. అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో కలిసి ఎంపీపీ సోమవారం సమీక్షించారు. మండలంలోని 31 పాఠశాలల్లో విద్యార్థులకు తగిన మౌలిక సదుపాయాలను కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. వాటి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

◆ కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నారాయణఖేడ్: పట్టణంలోని సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజైన సోమవారం కూడా కొనసాగాయి. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు కూడా పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం హంసవాహనసేవ, మహారాజ్ ఆధ్వర్యంలో కీర్తన నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి సమితి సభ్యులు తెలిపారు.

◆ భూపాల్ రెడ్డిని కలిసిన ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శాసనమండలి మాజీ ప్రోటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ మెదక్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ సెగ్మెంట్‌లో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ వెన్నవరం సింధు ఆదర్శ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల డైరెక్టర్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, నాయకులు జగన్నాథ్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

◆ బీఆర్‌ఎస్‌కు బంగారు భవిష్యత్

కోహీర్(జహీరాబాద్): బీఆర్‌ఎస్ పార్టీకి ఉజ్వలమైన బంగారు భవిష్యత్ ఉందని పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహులు యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని కవేలి ఎస్‌ఎస్ ఫ్యామిలీ రెస్టారెంట్ వద్ద సోమవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో మంగళవారం నిర్వహించనున్న కేసీఆర్ సభకు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

◆ ఈఓగా విజయ్‌కుమార్ బాధ్యతలు

కోహీర్(జహీరాబాద్): కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యనిర్వహణ అధికారిగా బడంపేట పంచాయతీ కార్యదర్శి విజయకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కోహీర్ ఇన్‌చార్జి ఈఓ లక్ష్మణాచారి ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో విజయ్‌కుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీడీఓ భారతి ఉత్తర్వులు జారీ చేశారు.

◆ ఇంటింటా ప్రచారం

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ తరఫున సోమవారం చెన్నారెడ్డి నగర్, రాయల్ గ్రీన్ సిటీ కాలనీలో ఆపార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భావవ్యక్తీకరణే ముఖ్యం

పటాన్‌చెరు: జర్నలిజంలో విజయం సాధించాలంటే భావవ్యక్తీకరణ, ప్రేక్షకులను కట్టి పడేసే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుందని హిందూ బిజినెస్ లైన్ మాజీ అసోసియేట్ ఎడిటర్ సోమశేఖర్ అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్‌హెచ్‌ఎస్)లోని మీడియా స్టడీస్ అండ్ విజువల్ కమ్యూనికేషన్స్ విభాగం జర్నలిజంలో.. మార్గదర్శనం భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, ప్రజా ప్రయోజనాలు అనే అంశంపై సోమవారం మాట్లాడారు. జర్నలిజం ఎలా రూపాంతరం చెందిందో వివరించారు. జర్నలిస్టులు తమ నైపుణ్యం ఆధారంగా మీడియాను ఎంచుకోవాలన్నారు. మీడియా స్టడీస్ అండ్ విజువల్ కమ్యూనికేషన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలకృష్ణ... సోమశేఖర్‌ను సత్కరించారు.

దేశ సమగ్రాభివృద్ధికి బీజేపీని ఆదరించండి



ప్రచారంలో సంగమేశ్వర్, బీజేపీ నేతలు

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): దేశ సమగ్రాభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని ఆపార్టీ మెదక్ లోక్‌సభ కన్వీనర్ కొవ్వూరి సంగమేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని నిజాంపూర్‌లో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించి పార్టీ లోక్‌సభ అభ్యర్థిని రఘునందన్‌ను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల మోదీ పాలనలో దేశం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. రహదారుల అభివృద్ధి, రైల్వే లైన్ల ఏర్పాటు, పేదరిక నిర్మూలన, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూనే, తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసి శత్రుదేశాలకు వణుకు పుట్టించారన్నారు. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారత విద్యార్థులను సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చిన ఘనత మోదీకే దక్కుతుందన్నారు. ఎన్నో సున్నితమైన సమస్యలను సైతం పరిష్కరించి భారత్‌ను ప్రపంచ దేశాలకు దీటుగా నిలిపారన్నారు. ఓటు వేసే ముందు ప్రతి ఒక్కరూ ఆలోచించాలన్నారు. ఆత్మకూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు.